భవితకు బాటలు..

- ఏయూలో పూర్తయిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు
- అత్యంత నాణ్యతతో భవన నిర్మాణాలు

ఏయూ క్యాంపస్: విద్యాభివృద్ధిలో మౌలిక వసతుల కల్పన ఎంతో కీలకం. మారుతున్న అవసరాలు, విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా సదుపాయాల కల్పన ఎప్పటికప్పుడు చేపట్టాల్సిన అవసరం ఉంటుంది. ప్రధానంగా భవనాల నిర్మాణం తప్పనిసరి. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి రానున్న రెండు దశాబ్దాల కాలానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఉపయుక్తంగా బహుళ నిర్మాణాలను సమర్థవంతంగా పూర్తి చేశారు. ఏయూ ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది నిరంతర సేవల ఫలితంగా విభిన్న ప్రాజెక్టులను నిర్ణీత కాలంలో పూర్తి చేశారు.

ప్రతి భవనం.. ఓ ప్రత్యేకత

విశ్వవిద్యాలయం నాలుగు వైపులా పలు భవనాలు నిర్మించారు. ప్రతి భవనం ఒక ప్రత్యేకతను కలిగి ఉండేలా తీర్చిదిద్దారు. ప్రధానంగా ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రారంభంలోనే ఆ హబ్, కొద్ది దూరంలో నాస్కామ్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం ఎదురుగా నిర్మించిన అల్గారిథం భవనాలు వేటికవే ప్రత్యేకం.



ఏయూ సిబ్ భవనం

- ఆ హబ్ నూతన ఆవిష్కరణల దిశగా విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ భవన నిర్మాణం చేపట్టారు.
- అల్గారిథం భవనం డిజిటల్ క్లాస్ రూమ్‌లు, విశాలమైన సమావేశ మందిరాలు, ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణకు ఉపయుక్తంగా సువిశాలమైన అంతస్తుతో ఎంతో దూరదృష్టితో నిర్మించి అందుబాటులోకి తీసుకొస్తున్నారు.



ఎలిమెంట్ భవనం

- సైన్స్, ఫార్మసీ కళాశాలల సౌకర్యార్థం సిరిపురం కూడలి వద్ద నిర్మించిన ఎలిమెంట్ భవనం, చుట్టూ తీర్చిదిద్దిన లాన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.
- ఆర్ట్స్ కళాశాల పరిధిలో ఐఐఎంతో సంయుక్తంగా నిర్వహిస్తున్న స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ భవనం మరో కలికితురాయిగా నిలుస్తోంది. అంతర్జాతీయ విద్యార్థుల ఆలోచనలు, అవసరాలకు అనుగుణంగా దీనిని డిజైనింగ్ చేసి నిర్మించారు.



ఆ హబ్

ప్రభుత్వ అధికారుల ప్రశంసలు

కోవిడ్ వంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కొని ఇంజినీరింగ్ సిబ్బందిబహుళ అంతస్తుల భవనాలను సమర్థవంతంగా పూర్తి చేశారు. టెండర్లు ఎస్ఎస్ఆర్ కంటే 10 నుంచి 16 శాతం తక్కువకు తీసుకుంటూ, నాణ్యతలో రాజీలేకుండా పని చేశారు. ఏయూ భవనాల నిర్మాణం, నాణ్యత స్వయంగా పరిశీలించిన ఉన్నత విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యామలరావు సైతం ఇంజినీరింగ్ సిబ్బంది పనితీరును ప్రశంసించారు.

హాస్టళ్లకు కొత్తరూపు

ఇంజినీరింగ్ సిబ్బంది హాస్టళ్లకు కొత్త రూపును తీసుకువస్తూ ఎంతో ప్రతిష్టాత్మకంగా పూర్తి చేశారు. వీటిలో ప్రధానమైనది ఏయూ స్టూడెంట్ హోం. దీని పునర్నిర్మాణానికి దాదాపు రూ 2.5 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేయగా.. కేవలం రూ.32 లక్షల నిధులతో పూర్వ వైభవం తీసుకొచ్చారు. శిథిలావస్థకు చేరుకుంటున్న శాతవాహన హాస్టల్, ఇంజినీరింగ్ విద్యార్థినుల హాస్టల్ భవనాలకు పూర్తి స్థాయిలో కెమికల్ ట్రీట్‌మెంట్ చేసి, కొత్తదనం తీసుకొచ్చారు.



ఆధునికీకరించిన స్టూడెంట్ హోం

స్వేచ్ఛనిచ్చారు..



అధికారులు పూర్తి స్వేచ్ఛాపూరిత వాతావరణాన్ని కల్పిస్తూ విధులు నిర్వహించేలా ప్రోత్సహించారు. నిరంతరం పనుల ప్రగతిని పర్యవేక్షించడం, అవసరమైన సూచనలు చేయడం మేలు చేశాయి. విద్యార్థులకు అవసరమైన కార్యక్రమాలు చేపట్టామనే సంతృప్తి ఉంది.

– ఆర్.శంకరరావు, యూనివర్సిటీ ఇంజినీర్

అధునాతన టెక్నాలజీ.. అత్యంత నాణ్యత

అధునాతన టెక్నాలజీని ఎప్పటికప్పుడు వినియోగిస్తూ, అత్యంత నాణ్యత ప్రమాణాలతో పనులు చేపడుతున్నాం. ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిరంతరం పనుల నాణ్యత పరిశీలన జరుగుతోంది. భవన అవసరాలకు అనుగుణంగా ఆర్కిటెక్ ఇచ్చే సూచనలు స్వీకరిస్తూ గ్రీన్ టెక్నాలజీ కాన్సెప్ట్‌ని సైతం అమలు చేస్తున్నాం. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మార్పులు, చేర్పులు చేస్తూ పనులు పూర్తి చేస్తున్నాం.

– ఆచార్య వజీర్ మహ్మద్, డీన్, ఏయూ ఇంజినీరింగ్ వర్క్స్

అనధికారిక అంతస్తు తొలగింపు



పెదగదిలి వద్ద అనధికారిక అంతస్తు తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు మంగళవారం పెదగదిలిలో అనధికారికంగా చేపట్టిన ఓ అదనపు అంతస్తును తొలగించారు. హెల్త్‌సిటీ అపోలో ఆస్పత్రి ముందు ఓ వ్యక్తి భవన నిర్మాణం చేపడుతున్నాడు. ఇందులో భాగంగా అనధికారికంగా నాలుగో అంతస్తు నిర్మించాడు. దీనిపై ఫిర్యాదులు వెళ్లడంతో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాలతో జోన్-2 ఏసీపీ వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ ఝాన్సీ, స్క్వాడ్ సిబ్బంది భవనాన్ని పరిశీలించారు. అనధికారికంగా నిర్మాణం చేపట్టిన నాలుగో అంతస్తును సిబ్బందితో కూల్చివేశారు. ఆక్రమణలు, అక్రమ కట్టడాలు నేరమని, అలాంటి వాటిని తొలగించి కఠిన చర్యలు చేపడతామని ఏసీపీ హెచ్చరించారు.

వ్యక్తి ఆత్మహత్య

సీతమ్మధార : ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి అక్కయ్యపాలెం, 80 ఫీట్‌రోడ్డులోని రామచంద్రనగర్‌లో రెడ్డి రామారావు (40) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రామచంద్రనగర్‌లో రామారావు ఓ రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య రెడ్డి సంతోష్ కుమారి , ఇద్దరు కుమారులు ఉన్నారు. రామారావు మానసిక పరిస్థితి సరిగా లేదని కొంతకాలంగా మందులు వాడుతున్నాడని భార్య సంతోష్‌కుమారి చెప్పింది. భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చూపాలి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ఏయూ క్యాంపస్: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని కేడీపీఎం పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుమతి బాయి అన్నారు. మంగళవారం ఉదయం పాఠశాల పూర్వ విద్యార్థుల సహాయంతో నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవంలో ఆమె మాట్లాడారు. చదవుకున్న పాఠశాలను మరువకుండా ప్రతి సంవత్సరం కార్యక్రమాలను నిర్వహిస్తున్న 2002 బ్యాచ్ విద్యార్థులను అభినందించారు. క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వివిధ క్రీడాంశాలలో పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి డి.లక్ష్మీపతి, పాఠశాల పీఈటీ ఎస్.రత్నం తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆచార్య విజయమోహన్, తదితరులు

ఎంవీపీ కాలనీ: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మిడిల్ క్లాస్ బైకర్ సహకారంతో మాంక్‌ఫిట్ ఆర్గనైజేషన్ మంగళవారం నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఏయూ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ శిబిరాన్ని ఏయూ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ ఆచార్య ఎన్.విజయమోహన్, క్రీడా విభాగాధిపతి డాక్టర్ పల్లవి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తదానం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ శిబిరంలో 72 మంది రక్తదానం చేసినట్లు మాంక్‌ఫిట్ సంస్థ ప్రతినిధులు మహేష్, శ్రీనివాసరావు వెల్లడించారు. ఛత్రపతి శివాజీ బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు రక్తాన్ని సేకరించారు.

మన దేవాలయం-మన హక్కు సంతకాల సేకరణ



ప్రసంగిస్తున్న ఎంపీ జీవీఎల్ నరసింహారావు

ఏయూ క్యాంపస్: టీటీడీ పాలక మండలి ఏర్పాటులో భక్తుల మనోభావాలకు అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. మంగళవారం పెదవాల్తేరు పోలమాంబ ఆలయ ప్రాంగణంలో మన దేవాలయం-మన హక్కు సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాలక మండలి నియామకంలో ఆధ్యాత్మిక గురువుల సూచనలు తీసుకోవాల్సిందని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, పార్టీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

హిందుత్వ నేపథ్యం అవసరం

ఎంవీపీ కాలనీ: టీటీడీ పాలక మండలి సభ్యులకు హిందుత్వ నేపథ్యం ఉండాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు అన్నారు. మంగళవారం లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. హిందుత్వ నేపథ్యం లేనివారిని పాలక మండలిలో నియమించడం తగదన్నారు. నిర్మించిన బస్ బే 10 రోజుల్లోనే కూలిపోవడం జీవీఎంసీ అధికారుల అవినీతికి నిదర్శనమన్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో 60 వేల వరకు నకిలీ ఓట్లు నమోదు చేయించారని ఆరోపించారు.

అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు

ఆరిలోవ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అన్ని ప్రాంతాల్లోనూ అభివృద్ధి పరుగులు పెడుతోందని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ 13వ వార్డులో కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యంలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జైభీం నగర్, లక్ష్మీపార్వతి నగర్‌లో ఎంవీవీ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో కలిసి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యల గురించి ఆరా తీశారు. వృద్ధులు, యువకులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పలు సంక్షేమ పథకాల వల్ల ఎలాంటి లబ్ధి చేకూరుతుందో అడిగి తెలుసుకున్నారు. వాటి గురించి ప్రజలకు వివరించారు. అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించడమే తమ లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వార్డుల సచివాలయాల పరిధిలో రూ.20 లక్షల నిధులు ప్రత్యేకంగా కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. జగనన్న పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు టీడీపీ నాయకులు ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఎంపీ విమర్శించారు. వారు ఎన్ని ఆటంకాలు కల్పించినా అభివృద్ధి ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో పలు వార్డుల వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, ఆ పార్టీ నాయకులు, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



జైభీం నగర్‌లో వృద్ధుడి యోగక్షేమాలు తెలుసుకుంటున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఏయూ స్టార్టప్ సెంటర్ సందర్శన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం స్టార్టప్, ఇంక్యుబేషన్ సెంటర్‌ను లెఫ్టినెంట్ జనరల్ ఎస్.ఎస్.రాజ సుబ్రమణి మంగళవారం సందర్శించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి విచ్చేసిన ఆయన ఏయూలో విద్యార్థులకు స్టార్టప్ రంగంలో అందిస్తున్న ప్రోత్సాహం, విద్యార్థుల ఆవిష్కరణలు ప్రత్యక్షంగా పరిశీలించారు. భారత్ ఆర్థికంగా పటిష్టం కావడానికి స్టార్టప్‌లు ఎంతగానో ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. ఈ సందర్భంగా ఆ హబ్‌లో యువత ఏర్పాటు చేసిన వివిధ సంస్థలు పనిచేస్తున్న విధానం ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఏయూ ఆ హబ్‌లో చేపట్టే కార్యక్రమాల్లో తాము ప్రత్యక్షంగా భాగమవుతామన్నారు. ఈ సందర్భంగా ఏయూ వైఎస్ మూర్తి ఆడిటోరియం ఆవరణలో మొక్కను నాటారు. ముందుగా రాజ సుబ్రమణి ఏయూ పరిపాలనా భవనాన్ని సందర్శించారు. ఎన్‌సీసీ విద్యార్థులు, రక్షణ రంగాల ఉద్యోగుల గౌరవ వందనం స్వీకరించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి స్వయంగా సుబ్రమణిని ఆహ్వానించారు. ఏయూ క్యాంపస్ కళాశాలల ప్రిన్సిపాళ్లను పరిచయం చేశారు. ఏయూలో గత నాలుగు సంవత్సరాల కాలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, నూతన ప్రాజెక్టుల వివరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్స్ ఆచార్య జి.శశిభూషణరావు, వి.విజయలక్ష్మి, టి.శోభశ్రీ, ఎస్.కె.భట్టి, టి.శోభశ్రీ, వై.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న అధికారులు

ప్రణాళికతో కృషి చేస్తే విజయం తథ్యం

కొమ్మాది: మనలోని బలం, బలహీనతలను తెలుసుకుని ఒక ప్రణాళిక ప్రకారం కృషి చేస్తేనే విజయం సాధ్యమవుతుందని కలెక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. కొమ్మాదిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో మంగళవారం విద్యాలయ నిర్వాహక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అందుబాటులో ఉన్న అన్ని సౌకర్యాలను వినియోగించుకుంటేనే విద్యార్థులు ఉన్నత స్థానాలు చేరుకోగలరన్నారు. విద్యాలయానికి రెండు బోరు బావులు, 4 తరగతి గదులు, పది కంప్యూటర్లు, పార్ట్‌టైమ్ డాక్టర్ సదుపాయం కల్పించడంతో పాటు స్టాఫ్ క్వార్టర్స్, రోడ్ల మరమత్తులు చేయడానికి వీలుగా సీపీడబ్ల్యూడీకి సిఫార్సు చేయనున్నట్టు తెలిపారు. తాను కడప జిల్లాలో నవోదయ విద్యాలయంలో చదువుకున్నానని, వైద్య వృత్తి అనంతరం సివిల్స్‌కు ఎంపికైనట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నవోదయ ప్రిన్సిపాల్ కె.సంజయ్, విశాఖ వ్యాలీ ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్, అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కీర్తి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

రైల్వే ఉద్యోగి మృతి

సీతమ్మధార: రైల్వే ఉద్యోగి మృతి చెందిన సంఘటన ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే సీనియర్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్‌గా కె.వెంకటేశ్వరావు పనిచేస్తున్నారు. ఏవీఎన్ కళాశాల సమీప డెంకాడ వీధిలో నివాసముంటున్నారు. భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. సోమవారం రాత్రి 8.30 గంటల సమయంలో ఫిర్యాదు రావడంతో వెంకటేశ్వరరావుతోపాటు మరో ఉద్యోగి వెళుతున్నారు. మార్గ మధ్యలో సమస్య పరిష్కారమైందని ఫోన్ రావడంతో తిరిగి ఆఫీసుకు వచ్చి బైక్ స్టాండ్ వేస్తున్న సమయంలో వెంకటేశ్వరరావు వెనక్కి పడిపోయాడు. ఆస్పత్రికి తీసుకెళ్లగా మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కుమారుడు వెంకట పృథ్వీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

స్కేటింగ్‌లో సత్తాచాటుతున్న సాయిసాహితి



సాయిసాహితి

విశాఖ స్పోర్ట్స్ : నగరానికి చెందిన సాయిసాహితి స్కేటింగ్ పోటీల్లో సత్తా చాటుతోంది. ఇటీవల ఆస్ట్రేలియాలో జరిగిన పసిఫిక్ కప్ ఇన్‌లైన్ ఫ్రీస్కేటింగ్ బాలికల విభాగంలో సాయిసాహితి ద్వితీయస్థానంలో నిలవగా...ఫ్రీ స్కేటింగ్ బాలికల విభాగంలో తృతీయస్థానంలో నిలిచింది. ఫిగర్ స్కేటింగ్ ఓవరాల్‌లో సాయి సాహితి తృతీయస్థానంలో నిలిచింది. ఇప్పటివరకు పన్నెండేళ్ల ప్రాయంలోనే పలు జాతీయస్థాయి పోటీలతో పాటు అంతర్జాతీయ పోటీల్లోనూ తలపడి ఆర్టిస్టిక్ విభాగంలో పలు పతకాలను సొంతం చేసుకుంది. వరల్డ్‌స్కేట్ ఓషియేనియా ఆర్టిస్టిక్ స్కేటింగ్‌లో ఆస్ట్రేలియా,న్యూజిలాండ్, బ్రెజిల్, భారత్, జపాన్, చైనీస్ తైపెయ్, యూఎస్ఏ స్కేటర్లు జట్లు పాల్గొన్నాయి.

తేనె వంటిది తెలుగు భాష

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



ఎంవీపీ కాలనీ లైబ్రరీలో గిడుగు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యువత



విశాఖ వ్యాలీలో కవుల వేషధారణలో విద్యార్థులు



ఏయూ తెలుగు విభాగం ప్రొఫెసర్ ఈశ్వరమ్మను సత్కరిస్తున్న కృష్ణా కళాశాల అధ్యాపకులు

ఆరిలోవ: తెలుగు భాషా దినోత్సవాన్ని తూర్పు నియోజకవర్గంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. విశాఖ వ్యాలీ స్కూల్‌లో ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు ఆకట్టుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనతో అలరించారు. పలువురు తెలుగు కవులు, తెలుగు పండితుల వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. తెలుగువారి పిండి వంటలు, సంస్కృతి సంప్రదాయాలను ప్రదర్శించారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ బహుమతులు అందజేశారు.

- జీవీఎంసీ 12వ వార్డు చినగదిలి ప్రాంతం సంతపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆకులపై తెలుగు పదాలు రాసి ప్రదర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిరికి శ్రీనివారావు విద్యార్థులకు తెలుగు భాష గొప్పదనం గురించి వివరించారు.

ముగిసిన వారోత్సవాలు

ఆరిలోవ: డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాలలో తెలుగు భాషా వారోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఏయూ తెలుగు విభాగం ప్రొఫెసర్ ఈశ్వరమ్మను కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు, అధ్యాపకులు సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గిడుగు రామమూర్తి పంతులు తెలుగు భాషకు చేసిన సేవల గురించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు ఏయూ ప్రొఫెసర్లు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



సంతపాలెం పాఠశాలలో ఆకులపై తెలుగు పదాలు రాసి చూపుతున్న చిన్నారులు

ఎంవీపీ కాలనీ: స్థానిక లైబ్రరీలో వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి చిత్రపటానికి లైబ్రేరియన్ ఉమామహేశ్వరరావు, పలువురు సచివాలయ ఉద్యోగులు, యువత పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నగర కార్యాలయంలో గిడుగు చిత్ర పటానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు, ప్రధాన కార్యదర్శి పీవీఎన్ మాధవ్, నగర పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర పూలమాల వేసి అంజలి ఘటించారు. తెలుగు ప్రగతికి కృషి చేసిన వారిని సత్కరించారు.

తెలుగు వారసత్వ సంపద భావితరాలకు అందాలి

ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: తెలుగు భాషను వారసత్వ సంపదగా భావితరాలకు అందించాలని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఆంధ్ర విశ్వకళా పరిషత్ తెలుగు విభాగం ఆధ్వర్యంలో కళా ప్రపూర్ణ గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. మాతృభాషలో అనర్గళంగా మాట్లాడలేని వారు పరభాషలలో కూడా మాట్లాడలేరని, మనం చదువుకు ఇచ్చే ప్రాధాన్యత కంటే భాషకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నేటితరం విద్యార్థులు సాంకేతిక విద్య నేర్చుకున్నప్పటికీ భాష విషయంలో వెనుకంజలో ఉంటున్నారన్నారు. తెలుగు భాషలో అమూల్యమైన గ్రంథాలు ఉన్నాయని, అందులో మన జీవితానికి పనికి వచ్చే అంశాలను గ్రహించి ఇతర భాషల్లోకి తర్జుమా చేసి తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటాలని సూచించారు. తెలుగు భాషాభివృద్ధికి గిడుగు పాటుపడినట్టు ప్రతి ఒక్కరు కంకణదారులై భాష మనుగడకు నడుం కట్టాలన్నారు. తెలుగులో అవధాన ప్రక్రియ మనకే సొంతమని, అటువంటి సాహిత్య ప్రక్రియకు ఆధునితను మేళవించి భాషను రక్తి కట్టించాలన్నారు.

ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. గిడుగు వంటి మహనీయుల త్యాగం ఫలితంగా ఏయూలో మొదట తెలుగు విభాగం ప్రారంభమైందని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య జర్ర అప్పారావు అధ్యక్షత వహించగా, ఆత్మీయ అతిథులుగా ఆచార్య జి.యోహానుబాబు, డాక్టర్ దామెర వెంకట సూర్యారావు, మీగడ రామలింగస్వామి, పరవస్తు పణిశయన సూరి హాజరయ్యారు. అనంతరం తెలుగు పరిశోధక విద్యార్థి ఇళ్ళ మురళీధరరావు రచించిన పద్యకావ్యాలను ఆవిష్కరించారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఆచార్యులు డాక్టర్ బూసి వెంకటస్వామి, డాక్టర్ కె.రత్నశేఖర్, డాక్టర్ పి.లావణ్య, డాక్టర్ ఎ.వెంకటేశ్వర్లు(యోగి), తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ నరసింహారావు

శ్రీవారికి భక్తిశ్రద్ధలతో పవిత్రాల సమర్పణ

ఎంవీపీ కాలనీ: శ్రీవేంకటేశ్వరస్వామికి పవిత్రాల సమర్పణ కార్యక్రమం మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో రెండు రోజులుగా పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. విశాఖ కార్తీక దీపోత్సవం టీమ్, వైదిక విపంచి, శ్రీవారి సేవ టీమ్, టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పవిత్రోత్సవాలు జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం స్వామి వారికి శ్రవణ నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా శ్రీవారికి పవిత్రాలు సమర్పించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలు వాయిదా వేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. తమకు సిలబస్ ఇంకా పూర్తి కాలేదని సెప్టెంబర్ 1వ తేదీ నుంచి జరగాల్సిన పరీక్షలు వాయిదా వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్.జె.నాయుడు, విజయనగరం జిల్లా కార్యదర్శి పి.రామ్మోహనరావు, నాయకులు పి.రాము, సౌమ్య, హర్ష ఏయూ కార్యదర్శి పి.సూర్య, హర్షిత్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఎంవీవీకి అభినందన

ఎంవీపీ కాలనీ: వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగా నియామకమైన విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు ఏపీ టూరిజం శాఖ డైరెక్టర్ కారి శ్రీలక్ష్మి మంగళవారం అభినందనలు తెలిపారు. లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.



ఎంపీకి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలుపుతున్న శ్రీలక్ష్మి